క్లుప్తంగా

జల్‌పల్లిలో నేడు మంత్రి పర్యటన

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు గురువారం మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేయనున్నారని కమిషనర్ వసంత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. 11కేవీ లెక్చరర్స్‌కాలనీ, వీరభద్రకాలనీ, ఆలిండియా రేడియో న్యూనాగోలు, ఫణిగిరికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ శారదానగర్, హైకోర్టుకాలనీ ఫీడర్ల పరిధిలో ఉదయం 9.30 నుంచి 2 గంటల వరకు. 11కేవీ లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు. 11కేవీ పెద్ద అంబర్‌పేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు. 11కేవీ ఆర్‌కేపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు. 11కేవీ ఫ్రూట్‌మార్కెట్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

శ్రీరాంకాలనీలో తొట్టెల ఊరేగింపు



ఊరేగింపులో యువత, భక్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని 20వ వార్డు శ్రీరాంకాలనీలో శ్రీసాయి దత్త కల్చరల్ యూత్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం రాత్రి బోనాల తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఆషాఢమాసం బోనాలలో భాగంగా గణేష్ మండపం నుంచి పోతరాజుల విన్యాసాల నడుమ పెద్దఎత్తున నృత్యాలు చేస్తూ పోచమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఊరేగింపులో బోడ హరికృష్ణ నేత, సంగం మురళీ, శ్రీకాంత్, పున్న గణేష్, చింటూ, రాము, ప్రభాకర్, దీపక్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

14న క్యాంపస్ ఇంటర్వ్యూలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్‌లోని సెయింట్ ఫాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే రెండవ అతిపెద్ద ఫార్మా దిగ్గజం దివీస్ లాబొరేటొరీస్ చౌటుప్పల్.. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అష్యూరెన్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ 21వ వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తకుర్మ కార్తీక్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా శ్రీ సూర్య సాయినగర్, జనచైతన్య కాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం కొరకు హెచ్‌ఎండీఏ నిధులను కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు కార్తీక్ తెలిపారు. వార్డు అధ్యక్షులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడకల్‌లో డ్రైనేజీల నిర్మాణం చేపట్టండి: సీపీఎం

తలకొండపల్లి: పడకల్ గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని సీపీఎం సీనియర్ నాయకులు పెంటయ్య, రమేశ్ కోరారు. మండల పరిధిలోని పడకల్‌లో బుధవారం పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో మోరీల సమస్య ప్రధానంగా ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. మోరీలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఫలితంగా దుర్వాసనతో దోమలు, ఈగలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని వారి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను ప్రజాప్రతినిధుల, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెద్దయ్య, మాదవులు, సత్తయ్య పాల్గొన్నారు.

పంచాయతీలకు మహర్దశ

- మండలంలో రూ.2.60 కోట్లతో 13 జీపీలకు సొంత భవనాల నిర్మాణం
- గిరిజన పంచాయతీలకు ట్రైబల్ వెల్ఫేర్ నుంచి నిధులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

మహేశ్వరం: నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టింది. పరిపాలన సౌలభ్యంతో పాటు మారుమూల పల్లెల, గిరిజన తండాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అయితే నూతన గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, అద్దె భవనాలు, కమ్యూనిటీ భవనాలు తదితర చోట్ల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. సొంత భవనాలు లేని కారణంగా సమావేశాల నిర్వహణ, పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. దీనికితోడు కొన్నిచోట్ల పాత పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

మహేశ్వరం మండలంలో..

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)లో భాగంగా 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిలో భాగంగా పంచాయతీలకు పక్కా భవనాల కోసం ఖర్చు చేస్తుంది. మహేశ్వరం మండలంలోని మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో కొత్తగా ఏర్పాటైన 12 గ్రామ పంచాయతీలు.. డబిల్‌గూడ, దిలావార్‌గూడ, గంగారం, హబీబుల్లాగూడ(పులిమక్త), కేసీ తండా, మెహబ్బత్‌నగర్, నాగుల్‌దోని తండా, నందుపల్లి, పదమటి తండా, పెద్దమ్మ తండా, రామచంద్రగూడ, ఉప్పుగడ్డ తండా ఉన్నాయి. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద ఆ 11 గ్రామ పంచాయతీలకు ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి కేసీ తండా, నాగుల్‌దోని తండా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు మండలంలోని ఒక పాత గ్రామ పంచాయతీ హర్షగూడతో పాటు కొత్తగా ఏర్పాటైన 12 గ్రామ పంచాయతీలు మొత్తం 13 గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణానికి ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.2 కోట్ల 60 లక్షల నిధులను మంత్రి సబితారెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. ప్రస్తుతం మంజూరైన గ్రామ పంచాయతీల్లో భవనాల నిర్మాణ పనులకు ఇటీవల మంత్రి కొన్నింటికి శంకుస్థాపన చేయగా, మరికొన్ని త్వరలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం కొన్ని పంచాయతీ భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆయా నిర్మాణాలపై నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణ దశలో పదమటి తండా గ్రామ పంచాయతీ భవనం

నిధుల మంజూరు హర్షణీయం



నాగారం గ్రామ పంచాయతీకి అనుబంధంగా ఉన్న నందుపల్లి గ్రామం కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పాటైంది. పంచాయతీ భవనం లేక గ్రామంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో పంచాయతీ భవనాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశాం. పంచాయతీ రికార్డులు, ఫర్నీచర్, ఫైల్స్, ఇతర సామగ్రి భద్రపర్చుకోవడానికి, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు పడేవారం. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరుకావడంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

– కళావతి, సర్పంచ్, నందుపల్లి

మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు



కొత్తగా ఏర్పాటైన మా తండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి భవనం లేక అద్దె ఇంట్లో కొనసాగించాం. కొత్త భవనానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే మంత్రి స్పందించి ట్రైబల్ వెల్ఫేర్ నిధుల నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయించిన మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– రాజునాయక్, సర్పంచ్, నాగుల్‌దోని తండా

త్వరలో పనులు ప్రారంభిస్తాం



మండలంలో కొత్తగా ఏర్పాటైన 12 గ్రామ పంచాయతీలతో పాటు ఒక పాత గ్రామ పంచాయతీ భవనంతో పాటు మొత్తం 13 గ్రామ పంచాయతీలకు ఎన్‌ఆర్‌జీఈఎస్, ట్రైబల్ వెల్ఫేర్ నిధుల కింద రూ.2.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మంజూరైన వాటిలో కొన్ని గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరికొన్ని భవనాలకు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ, మహేశ్వరం

సత్యాగ్రహ దీక్ష నుంచి దృష్టి మరల్చేందుకే..

బీఆర్‌ఎస్‌పై కప్పాటి ఫైర్



కందుకూరు: కాంగ్రెస్ తలపెట్టిన సత్యాగ్రహ దీక్ష నుంచి తెలంగాణ ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ సూచనతో కేసీఆర్, కేటీఆర్ ఆదేశాలతో బీఆర్‌ఎస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నేత కప్పాటి పాండురంగారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అమెరికాలో ఎన్నారైలు నిర్వహించిన తానా సభలో ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమాధానంగా 3 ఎకరాల్లోపు ఉన్న 95 శాతం రైతులకు 16 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తే సరిపోతుందని చెప్పారన్నారు. ఆ విషయాన్ని వక్రీకరిస్తూ మాట్లాడటం బీఆర్‌ఎస్ నాయకులకే చెల్లిందన్నారు. ఉచిత విద్యుత్ పథకం కాంగ్రెస్‌దేననే విషయాన్ని గుర్తించాలన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మండల ఏర్పాటుపై హామీని నిలబెట్టుకోవాలన్నారు. మండల ఏర్పాటుకు గట్టుఇప్పలపల్లికిఅన్ని అర్హతలున్నాయన్నారు. మండల ఏర్పాటుపై స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ నుంచి మండల పరిధిలోని ఆకులమైలారంకు చెందిన వెంకటయ్యకు రూ.60 వేలు, దెబ్బడగూడకు చెందిన మహేశ్‌కు రూ.14,500 మంజూరయ్యాయి. ఆ మంజూరైన చెక్కులను బుధవారం జెడ్పీటీసీ లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రోశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, మాజీ పీఏసీస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ కలమ్మరాజు, ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, రాములు, మాజీ సర్పంచ్ జంగయ్య, నాయకులు పాండుగౌడ్, రాజు, దామోదర్‌గౌడ్, ప్రకాష్‌రెడ్డి, యాదయ్య, ప్రవీణ్, కార్తీక్, దేవులా, విఘ్నేశ్వర్ రెడ్డి, దీక్షిత్‌రెడ్డి, రామకృష్ణ, ఆలీ, హన్మంత్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న జెడ్పీటీసీ జంగారెడ్డి

విద్యాసంస్థల బంద్ విజయవంతం



పాఠశాలను మూసివేయిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మీర్‌పేట: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ బాలాపూర్ మండల కార్యదర్శి దాసరి అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ఇప్పటివరకు యూనిఫారంలు, కొన్ని పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందలేదని ఆరోపించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు మీసాల స్టాలిన్, ఇస్లావత్ సంతోష్, రాసనోళ్ల ప్రకాశ్, భాస్కర్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోజ్, అఖిల్, శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి అటవీభూమిని కేటాయించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అందెల వినతి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో వెలిసిన మర్ల మైసమ్మ ఆలయానికి అటవీభూమిని కేటాయించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు.. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని కోరారు. బీజేపీ కార్పొరేటర్లతో కలిసి బుధవారం కిషన్‌రెడ్డిని కలిసిన అందెల మాట్లాడుతూ.. మర్ల మైసమ్మ పురాతన ఆలయం గుర్రంగూడలోని ఫారెస్ట్‌లో ఉందని అన్నారు. కొంతకాలంగా ఫారెస్ట్ అధికారులు హద్దులు నిర్ణయిస్తూ మర్ల మైసమ్మ ఆలయం ఫారెస్ట్ పరిధి కిందకు వస్తుందని గుడిలోకి వెళ్లకుండా కంచె వేశారని అన్నారు. మర్ల మైసమ్మ తల్లికి గ్రామస్తులు ఏటా బోనాలు తీసుకువచ్చి పూజలు, నైవేద్యాలు చేసేవారని గ్రామ దేవతగా ఉంటుందని అన్నారు. ఇప్పుడు ఆ గుడి ఫారెస్టు పరిధిలో వస్తుందని ఫారెస్టు అధికారులు చుట్టూ ప్రహరీ నిర్మించారని అందెల తెలిపారు. ఆలయాన్ని ఫారెస్ట్ ల్యాండ్ నుంచి విముక్తి చేయాలని కిషన్‌రెడ్డిని విన్నవించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, శంకర్, మధుసూధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

'మహిళలు స్వశక్తితో ఎదగాలి'

మంచాల: మహిళలు స్వశక్తితో ఎదగాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్యారెడ్డి అన్నారు. మంచాల మండలంలోని దాద్‌పల్లి గ్రామంలో దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రం రంగారెడ్డి జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. పురుషులతో పాటు మహిళలు కూడా తమదైన విధానంలో కష్టపడి పనిచేయాలన్నారు. టైలరింగ్‌లో 45 రోజులు, బ్యూటీషియన్‌లో 30 రోజులు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు కూడా ఇస్తారని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్

- బడంగ్‌పేట మేయర్ పారిజాత
- విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం

బడంగ్‌పేట్: ఉచిత విద్యుత్ పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ప్రజలను, రైతులను మోసం చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మండిపడ్డారు. బుధవారం బడంగ్‌పేట కార్పోరేషన్ పరిధిలోని బాలాపూర్ సబ్‌స్టేషన్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను ఆమె సమక్షంలో కాంగ్రెస్ నాయులు దహనం చేశారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు మనోహర్, బాలునాయక్, సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాన్‌యాదవ్, జంగయ్య, జైహింద్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణ, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు సబ్‌స్టేషన్ ఎదుట..

కందుకూరు: ఉచిత కరెంట్ పేరుతో రైతులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ విమర్శించారు. బుధవారం కందుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు నరసింహాచారి, మైనార్టీ అధ్యక్షుడు అజీజ్, జిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి భూపాల్ రెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి వినోద్‌చారి, పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు గణేష్, కార్మిక సంఘం అధ్యక్షుడు సురేందర్, యూత్ నాయకులు వెంకటేష్‌గౌడ్, ఆంజనేయులు నాయక్, జగదీష్, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బాబు, పాండురంగారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, యాదగిరి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో..

తుక్కుగూడ: రైతు వ్యతిరేక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోగికర్ జానకీరామ్ అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో విద్యుత్ సబ్‌సేషన్ వద్ద ఆపార్టీ రాష్ట్ర కమిటీ పిలిపు మేరకు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు రాజేందర్, యాదయ్య, వెంకటేశ్, సురేందర్, సునీల్, పవన్‌రెడ్డి, శ్రీను, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మహేశ్వరం: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆ రోడ్డును పునరుద్ధరించండి

కమిషనర్‌కు లక్ష్మమ్మ కాలనీవాసుల వినతి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బాలాపూర్ మండలం నాదర్‌గుల్ సర్వే నంబర్ 68, 69, 79, 80లోని మర్రి లక్ష్మమ్మ కాలనీకి వెళ్లే 60 ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురైందని, ఆక్రమణ దారుల చెరనుంచి రోడ్డును విడిపించాలని ఆ కాలనీవాసులు బుధవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 41 ఏళ్ల క్రితం 58 ఎకరాల లేఅవుట్‌లో 690 ప్లాట్లు ఏర్పాటు చేశారని, ఆ సమయంలో హైటెన్షన్ లైన్ కింద 60 ఫీట్ల రోడ్డును ఏర్పాటు చేశారని, మున్సిపల్ అధికారులు ఇటీవల మార్కింగ్ చేసి బోర్డు కూడా నాటారని.. అయితే అధికారులు నాటిన బోర్డును స్థానికంగా ఉన్న కొంతమంది రియల్టర్లు ధ్వంసం చేశారని ఆరోపించారు. ఆక్రమణకు గురైన రోడ్డును పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరామన్నారు.

ఉమ్మడి దేవాలయాల కమిటీ ఎన్నిక

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామంలోని ఉమ్మడి దేవాలయాల కమిటీ చైర్మన్‌గా పి.శంకర్ యాదవ్, అధ్యక్షుడిగా ప్రశాంత్ ఎన్నికయ్యారు. హనుమాన్ దేవాలయంలో బుధవారం గ్రామస్తుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని పోచమ్మ, హనుమాన్, పెద్దమ్మ దేవాలయాల అన్ని ఉత్సవాలు వీరి ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. బోనాల ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు. భక్తులందరి సహకారంతో ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామని వారు తెలిపారు.

బీఆర్‌ఎస్ మహాధర్నాకు తరలిరండి

మండల అధ్యక్షుడు జయేందర్

కందుకూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి హాజరవుతారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రోశేఖర్, ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు సదానంద్‌గౌడ్, రాజు, కృష్ణారెడ్డి, ఆనంద్, శ్రీహరి, ప్రవీణ్‌నాయక్, సామయ్య, బాబయ్య, రామకృష్ణ, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, కుమార్, బాలకృష్ణ, ఆలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అన్నివర్గాలను మోసం చేస్తున్న సర్కార్

బీజేఈపీ నేత శ్రీరాములుయాదవ్



అందెల శ్రీరాములు సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడకు చెందిన పలువులు యువకులు బుధవారం బీజేపీలో చేరారు. నాదర్‌గుల్ బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకరవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ సమక్షంలో నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ సర్కార్ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగభృతి ఇస్తామన్న కేసీఆర్ ఇంకా ఎందుకు అమలు చేయడం లేదో నిరుద్యోగులకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే బీజేపీ ప్రభుత్వంలో నిరుద్యోగభృతి, పింఛన్లతో పాటు సర్కారు కొలువుల క్యాలెండర్‌ను చేపడుతామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలు చెప్పి అన్ని వర్గాలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి, సంతోషి, నిషికాంత్‌రెడ్డి, శ్రీకాంత్, వినీత్, శశాంక్ తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు నిరసనలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేకి అన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండుగలా చేసిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



మహేశ్వరం: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



హుడాకాంప్లెక్స్: కొత్తపేటలో..



కందుకూరు మండల కేంద్రంలో..

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంతారం, వెంకటాపూర్‌తండా, పెద్దూర్‌తండా, దేవుని పడకల్ తదితర గ్రామాల్లో పర్యటించి వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, బీటీరోడ్లు, సీసీరోడ్లకు ప్రారంభోత్సవాలు, అదేవిధంగా గ్రామ పంచాయతీ భవనాలు, పల్లె దవాఖానాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తలకొండపల్లి మండల కేంద్రానికి నూతనంగా జూనియర్ కళాశాల మంజూరైందన్నారు. ఆమనగల్లు పట్టణానికి ఏడీఏ కార్యాలయం, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయన్నారు. త్వరలో ఆమనగల్లు పట్టణంలో మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలు మంజూర్ కానున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు ఉచిత కరెంట్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్